వ్యవసాయ కూలీలకు ఉపాధి ఊతం

- చెరువులు, పంటబోదెలు తవ్వకంతో చేతినిండా పని
- అమృత సరోవర్ వల్ల పెరిగిన ఉపాధి




పాలకొల్లు మండలం కొత్తపేటలో అమృత సరోవర్ పథకంలో మంచి నీటి చెరువు తవ్వుతున్న ఉపాధి కూలీలు

పాలకొల్లు అర్బన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వ్యవసాయ కూలీల ఉపాధికి చేయూతనిస్తోంది. ముఖ్యంగా రైతులకు ఉపయోగపడే పంట బోదెలు, మురుగు బోదెలు, మంచినీటి చెరువులకు వెళ్లే పంట బోదెలు, చెరువుల తవ్వకం, స్థలాల పూడిక పనులు, పుంత దారుల మరమ్మతులు తదితర పనులు చేపట్టడంతో ఉపాధి హామీ కూలీల ఉపాధికి మార్గంచూపుతోంది. అలాగే జగనన్న లే అవుట్‌లో పేదలు నిర్మించుకుంటున్న పక్కా గృహాల లబ్ధిదారులకు ఒక్కో ఇంటికి 90 రోజులు పని దినాలు కల్పిస్తోంది. ప్రస్తుతం ఉపాధి కూలీకి రోజుకి రూ.257లు వేతనం లభిస్తోంది. వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలకు ఈ ఉపాధి పనులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

పనులు ఇలా

ముఖ్యంగా పంట బోదెలు మరమ్మతులు, చెరువుల తవ్వకం తదితర పనులు చేయడంతో కూలీలకు పని దినాలు పెరిగి చేతినిండా పని లభిస్తోంది. ప్రస్తుతం పాలకొల్లు మండలంలోని తిల్లపూడి, ఆగర్రు, చింతపర్రు, లంకలకోడేరు, చందపర్రు, వడ్లవానిపాలెం, గోరింటాడ, పెదమామిడిపల్లి, సగంచెరువు గ్రామాల్లో ప్రస్తుతం పంట బోదెలు, మీటరున్నర ఉన్న మేజర్ డ్రెయిన్‌ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే పాలకొల్లు మండలంలోని కాపవరంలో రూ.1.97 లక్షలతో మంచినీటి చెరువు, అలాగే రాళ్లచెరువులో రూ.3.46 లక్షలతో చెరువు మరమ్మతులు చేపడుతున్నారు. కొత్తపేటలో రూ.5.88 లక్షలతో మంచినీటి చెరువు మరమ్మతులు చేస్తున్నారు. వెలివెలలో రైతులకు ఉపయోగపడే పుంత రోడ్డును రూ.3.55 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. దీంతో పాటు యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెంలో రజకుల చెరువు, పశువుల చెరువులను కూడా అమృత సరోవర్ పథకంలో మరమ్మతులు చేస్తున్నారు.

2022-23 ఉపాధి పనుల వివరాలు

	అంచనా బడ్జెట్	మంజూరైన పనులు	పురోగతిలో ఉన్న పనులు	ప్రతిపాదిత పనిదినాలు	పూర్తయిన పనిదినాలు	100 రోజులు ఉపాధి పొందిన కూలీలు
పాలకొల్లు	రూ.4.42కోట్లు	952	752	1,72,000	1,33,126	137
యలమంచిలి	రూ.4.13కోట్లు	2286	1316	2,38,521	1,39,324	128
పోడూరు	రూ.5.20కోట్లు	1585	——	1,90,000	1,54,366	45

99 రోజులు ఉపాధి లభించింది



మాది సాధారణ కుటుంబం. వ్యవసాయ పనులే జీవనాధారం. ఉపాధి పనులు నా కుటుంబానికి ఎంతో ఉపయోగపడ్డాయి. ఈ ఏడాది నా భర్త రమేష్‌తో కలిసి 99 రోజులు ఉపాధి పొందాను. కూలీ రూ.257 గిట్టింది.

– బల్లె ప్రేమజ్యోతి, చింతపర్రు

పక్కాగా ఉపాధి



నాకు వైఎస్సార్ పక్కా గృహం మంజూరయ్యింది. ఇంటి పని చేసుకున్నాను. దీంతో మా కుటుంబానికి 96 రోజులు పనిదినాలు లభించాయి. గ్రామంలో పంట బోదెలు తవ్వకం పనులు కూడా చేశాను.

– కట్టా వరలక్ష్మి, కాపవరం

గ్రామంలో మొక్కలు పెంచాం



ఉపాధి హామీ పథకంలో గ్రామంలో మొక్కలు నాటి, వాటిని సంరక్షించాను. అలాగే పంట బోదెలు, కాలువలో తూడు తొలగింపు పనులు, డ్రెయిన్ తవ్వకం పనులు, చేసుకోవడంతో నాకు ఉపాధి లభించింది. 100 రోజులు పని చేసుకున్నాను.

– పెచ్చెట్టి రాధ, వడ్లవానిపాలెం

క్లుప్తంగా

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ ఎం. సూర్యతేజ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందించాలని కోరారు.

పంట కాలువ అధ్వానం



చినమామిడిపల్లి వద చెత్తతో నిండిపోయిన పంటకాలువ

నరసాపురం: పట్టణం మీదుగా చినమామిడిపల్లి–సరిపల్లి మీదుగా వెళ్లే పంట కాలువ అధ్వానంగా తయారైంది. పంటకాలువలో పూడిక పెరిగిపోయింది. అలాగే కాలువ నిండా చెత్తా పేరుకుపోయింది. దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని చినమామిడిపల్లి నుంచి కొప్పర్రు వరకూ సుమారు 5 వేల ఎకరాల భూములకు, దాదాపు 40 గ్రామాలకు సాగు, తాగునీటి అవసరాలకు ఈ కాలువే దిక్కు. అయితే ఎక్కడిక్కక్కడ చెత్త పేరుకుపోవడంతో నీరుపారడం లేదు. శివారు ప్రాంతాలకు అసలు నీరు చేరడం లేదు. ఈ కాలువలో పూడిక తీసి, శుభ్రం చేసి ఏడాదికాలం పైనే అవుతోంది. ప్రస్తుతం వేసవి కాలం వచ్చేసింది. కాలువలు కట్టేసే సమయం కూడా దగ్గర పడుతుందని ఇప్పటికైనా కాలువ శుభ్రం చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

పేరుపాలెంలో వైద్య శిబిరం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం సౌత్ పంచాయతీలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవాడకు చెందిన మన్వి ఆసుపత్రి వైద్యులు ఓసూరి బాల బాలాజీ హేమ బిందువుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన ఓసూరి వెంకటస్వామి నాయుడు జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ శిబిరంలో 1000 మంది రోగులకు న్యూరాలజీ, గైనకాలజీ, చర్మ, ఎముకలు, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ తిరుమాని విజయలక్ష్మీ ప్రారంభించగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కర్రి ఏసుబాబు, కారుమంచి జీవరత్నం, ఏఎంసీ వైస్ చైర్మన్ కటికల సూర్యారావు, వినుకొండ కాశీ, వనమాల శ్రీనివాస్, ఓసూరి కుటుంబ సభ్యులు సేవలందించారు.

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: చింతలకోటి గరువు గ్రామంలో శ్రీ ఉమాచంద్రశేఖరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ, చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ టి.బ్రహ్మం భగవద్గీత శ్లోకాలు పాడి వాటి అర్థాలను వివరించారు. ధ్యాన విశిష్టత తెలిపి అందరితో ధ్యానం చేయించారు. అనంతరం రాయకుదురు, చింతలకోటి గరువు చిన్నారులు చేసిన కోలాట నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన పంజా బాల శ్రీలక్ష్మి, నృత్య గురువులను, కేవీడీ ప్రసాద్ మాస్టర్, గ్రామ సర్పంచ్ దాసరి మహాలక్ష్మి, ఉప సర్పంచ్ దాసరి మాణిక్యాలు తదితరులను ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ డీవీఎస్ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు కోళ్లేపర శ్రీనివాసరావు, కాకిలేటి సీతారాముడు, యిర్రింకి కొండ, కామిశెట్టి శ్రీను, ఘంటా నాగదాసు, పంజా సురేష్, పసుపులేటి రాంబాబు, లంకలపల్లి నరసింహారావు, పి.తాతయ్యనాయుడు, కొమ్మన శ్రీను పాల్గొన్నారు.

సత్రాజుకు సర్వోదయ మండలి నివాళి

సాక్షి, భీమవరం: క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు మరణం తీరని లోటని జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. సర్రాజు ఆకస్మిక మృతి పట్ల జిల్లా సర్వోదయ మండలి తరపున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పెదనింద్రకొలనులోని గాంధీ స్మారక భవనాన్ని పునఃప్రారంభించడంలో సర్రాజు కృషి చేశారని గుర్తు చేశారు. సంతాపం తెలిపిన వారిలో చర్ల మృదుల కుమారి, సాగిరాజు జానకి రామరాజు తదితరులున్నారు.

స్త్రీల సమాజ కార్యవర్గ ఎన్నిక

సాక్షి, భీమవరం: బేతనీ లూథరన్ చర్చి స్త్రీల సమాజం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పట్టా ఇందిరా, కార్యవర్గ సభ్యులుగా బి.జ్ఞానకుమారి, పి.జెమిని, పి.అలీస్, ఎస్.నీలిమ, పి.సోని తదితరులు ఎన్నికయ్యారు. అదే విధంగా రెస్ట్‌హౌస్ రోడ్డు క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ చైర్మన్‌గా బేతనీ పేటకు చెందిన ఎం.ఆనోకిన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనకార్యవర్గాన్ని సత్కరించారు.

గ్రామోత్సవాల సందడి



శివదేవస్వామి రథోత్సవంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు



మేడపాడులో స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవుని చిక్కాల గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పార్వతి సమేత శ్రీ శివదేవస్వామి కళ్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథోత్సవంపై ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసి పార్వతి అమ్మవారి పుట్టిల్లైన బల్లిపాడు గ్రామానికి ఉత్సవమూర్తులను రథంలో తీసుకువెళ్లి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు అనంతరం అమ్మవారి పుట్టింటివారైన భాపతిరాజు వంశస్తులు పట్టు వస్త్రాలు సమర్పించారు. శివదేవుని చిక్కాల బస్టాండ్ సెంటర్లో పుష్పాభిషేకం కమిటీ సభ్యులు ఉత్సవమూర్తులకు పుష్పాభిషేకం చేశారు. రథం లాగడానికి యువత, గ్రామ పెద్దలు, మహిళలు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆకుల నాగమురళి, ట్రస్టుబోర్డు చైర్మన్ సాధనాల లక్ష్మీ, ఈవో నామాల రంగరాజన్, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

మేడపాడులో..

యలమంచిలి: మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం మేడపాడు గ్రామంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవాయిద్యాలు, తీన్ మార్ డప్పుల మధ్య దేవేరుల విగ్రహాలను పల్లకిలో ఉంచి గ్రామోత్సవం చేశారు. మహిళలు హారతులు ఇచ్చి ఆశీర్వాదం పొందారు. ఐదో రోజు మంగళవారం ఆలయంలో పుష్పోత్సవం నిర్వహించడంతో శివరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అర్చకులు బాదంపూడి సత్యనారాయణమూర్తి తెలిపారు.

ఆచంటలో కొనసాగిన భక్తుల రద్దీ



ఆకట్టుకున్న మంజు కూచిపూడి నృత్య ప్రదర్శన



ఆచంటేశ్వరుని తిరునాళ్లల్లో భక్తుల రద్దీ

పెనుగొండ ఆచంటలో శ్రీ ఆచంటేశ్వరస్వామి వారి తిరునాళ్లు వైభవంగా జరుగుతున్నాయి. పరిసర ప్రాంతాల నుంచి ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తిరునాళ్లకు తరలివస్తున్నారు. ఆచంట–కోడేరు ఆర్అండ్‌బీ రహదారిలో కచేరి సెంటరు నుంచి స్వామి వారి సత్రం వరకూ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన స్టాల్స్ కొనుగోలుదారులు, సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన కొనసాగుతోంది. ఆదివారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పార్వతి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. స్వామి వారి గ్రామోత్సవం ఆదివారం పుర వీధులగుండా సాగింది. స్వామివారిని, అమ్మవార్లను నంది, సింహ వాహనాలపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

అలరించిన నృత్యప్రదర్శన..

స్వామి వారి కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా పెనుగొండ మండలం చినమల్లం గ్రామానికి చెందిన అయినవిల్లి మంజు ప్రదర్శించిన కూచిపూడి భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంజును ఆలయ కమిటీ సభ్యులు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, ఈవో రామచంద్రకుమార్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సోమవారం స్వామి వారికి పుష్పోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న భజరంగ్‌దళ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ప్రపంచ దేశాల్లో హిందూవులకు గుర్తింపు వచ్చిందంటే ఛత్రపతి శివాజీ, స్వామి వివేకానంద వల్లేనని భజరంగ్‌దళ్ పట్టణ ప్రముఖ్ భరత్ తెలిపారు. ఆదివారం పట్టణంలో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపి పట్టణ అధ్యక్షులు జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ మతమార్పిళ్లు లేకుండా యువతకు మన హిందూ ధర్మం శక్తి ఏ పాటిదో చాటి చెప్పిన గొప్ప వ్యక్తి శివాజీ అని అన్నారు. కార్యక్రమంలో హైందవశక్తి, బీజేపీ, ధర్మ పరిరక్షణా సమితి, క్షీరా రామలింగేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలక్ష్మణేశ్వరుని తెప్పోత్సవం



హంసవాహనంపై తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం.

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరంలో ఉన్న శ్రీ దుర్గాలక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ సమీపంలో ఉన్న కోనేరులో హంస వాహనాన్ని పూలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్పులమధ్య దుర్గా లక్ష్మణేశ్వరులను మేళతాళాలతో ఆలయం నుంచి వేడుకగా తీసుకువచ్చి సుందరంగా అలంకరించిన కోనేరులోని తెప్పపై స్వామివారిని ఊరేగించారు. ఈ వేడుకను చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. తొలుత ఆలయంవద్ద టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో సంగీతం–బుర్రకథ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కంకటాల పెద్దిరాజు, ఈవో చాగంటి సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులే అసలైన సైకోలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: తన స్వార్థపూరితమైన ప్రచారం కోసం పుష్కరాల సమయంలో 29 మంది మరణానికి కారణమైన చంద్రబాబును నిజమైన సైకో అని అంటారని డీజీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ విమర్శించారు. స్థానిక శాసన సభ్యులు నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన విమర్శలపై ఆదివారం తాతాజీ తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఇరుకు రోడ్లల్లో సమావేశాలు పెట్టడం, నిత్యావసర సరుకులు, దుస్తులు ఇస్తున్నామని ప్రచారం చేసి వచ్చిన జనాల్లో తొక్కిసలాటకు గురై ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన చంద్రబాబును, టీడీపీ నాయకులను సైకోలంటారని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు చదువు కొన్నాడో లేక చదువుకున్నాడో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. రామానాయుడు ఇకపై చౌకబారు విమర్శలు చేస్తే సహించేది లేదని తాతాజీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గంటా నరేష్, చెన్ను విజయ్, పెచ్చెట్టి కృష్ణాజీ, పిల్లా శ్రీను, పాలపర్తి కృపానాథ్, కాపిశెట్టి శ్రీను, త్సవటపల్లి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రామన్నపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం

పెనుగొండ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకూ మన ప్రభుత్వం సోమవారం రామన్నపాలెంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు నలిమిల్లి వేణుప్రతాప రెడ్డి(బాబి) తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారులకు అందించిన సంక్షేమాన్ని వివరిస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పేరు మార్పు

నేను గుడాల వెంకట నాగలక్ష్మి, నివాసం డి.నెం. 2-30, ... పెనుగొండ, పశ్చిమ గోదావరి జిల్లా, ఆం.ప్ర. ... గుడాల లక్ష్మి కుమారి (పాత పేరు) ... గుడాల వెంకట నాగలక్ష్మి (కొత్తపేరు) గా మార్చుకొనుచున్నాను ...

లింగోద్భవ సమయంలో పోటెత్తిన భక్తజనం



లక్ష్మణేశ్వరంలో పూజలు నిర్వహించిన దృశ్యం



క్షీరారామలింగేశ్వరస్వామికి మల్లన్న పాగా తీసుకువెళుతున్న భక్తులు



లింగోద్భవ సమయంలో స్వామివారికి పాలాభిషేకం చేస్తున్న అర్చకులు

పాలకొల్లు సెంట్రల్: మహాశివరాత్రి పురస్కరించుకుని పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. స్వామి వారి మల్లన్న పాగాను తయారు చేసిన వరదా సోమేశ్వరరావు 11.45 గంటల సమయంలో ఆలయంలో ప్రదక్షిణలు చేసి ఆలయ అర్చకులకు పాగాను అందజేశారు. పాగాను స్వామి వద్దకు తీసుకువెళ్లి పూజలు జరిపించారు. అనంతరం ఆలయ శిఖరం నుంచి గాలి గోపురం శిఖరం వరకూ పాగాను అలంకరించారు. లింగోద్భవ సమయం అనంతరం ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో స్వామివారికి లక్షపత్రి పూజ చేశారు. కొందరు భక్తులు ఏకాదశ మహా రుద్రాభిషేకాలు చేయించుకున్నారు. ఆదివారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం రావణాబ్రహ్మ వాహనంపై పార్వతి సమేత శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి, లక్ష్మీ జనార్ధనస్వామి వార్లను ఊరేగించారు. గ్రామోత్సవానికి ముందుగా గాదె జనార్ధన గుప్త కుటుంబ సభ్యులు కుంభంపోసి నైవేద్యం సమర్పించారు. అనంతరం వివిధ సన్నాయి వాయిద్యాలతో, బ్యాండ్ మేళాలతో, గరగల నృత్యాలతో స్వామివార్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసు, ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ, ఆలయ అర్చకులు కిష్టప్ప, మల్లేశ్వరరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గా లక్ష్మణేశ్వరుని లింగోద్భవ పూజ

నరసాపురం రూరల్: మండలంలోని శ్రీదుర్గా లక్ష్మణేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి స్వామివార్ల లింగోద్భవ పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి ఆలయంలో పలువురు దంపతులతో ప్రత్యేక పూజాభిషేకాలు, విశేషార్చన, కుంకుమార్చనలు చేయించారు. ఆలయ ప్రధానార్చకుడు యలమంచిలి ప్రసాదశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు. ఉదయం శేషార్చన, వసంతోత్సవం, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యదర్శి చాగంటి సురేష్‌నాయుడు, ఆలయ చైర్మన్ కంకటాల పెద్దిరాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.